క్లుప్తంగా

ఆస్పత్రిలో రోగులకు అన్నదానం



రోగులకు అన్నదానం చేస్తున్న డాక్టర్ శంకరరావు, పవన్‌కుమార్ తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు, వారి బంధువులకు నల్లా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నల్లా పవన్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు సూచన మేరకు ప్రతి నెలా 9వ తేదీన ఆస్పత్రికి వచ్చే స్కానింగ్ రోగులకు కూడా అన్నదానం ఏర్పాటు చేస్తామని పవన్‌కుమార్ ప్రకటించారు. అన్నదాన కార్యక్రమంలో ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు యల్లమిల్లి నాగ సుధా కొండ, ట్రస్ట్ ప్రతినిధి సలాది నాగేశ్వరరావుతో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుల విభాగం ఏర్పాటు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో తాగునీటి సరఫరా, పారిశుధ్య పరంగా ప్రజలకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి ఫిర్యాదు విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ తెలిపారు. ఈ రెండు విభాగాల సమస్యలపై ఫిర్యాదులు చేయాలనుకున్నవారు 78937 90444 ఫోన్ నెంబరుకు వాట్సాప్ లేదా ఫోన్ చేసి సమస్యను వివరించొచ్చన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యతా క్రమంలో సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు మున్సిపల్ సిబ్బంది కృషి చేస్తారని స్పష్టం చేశారు. ఫిర్యాదుల విభాగాన్ని, దానికి ఇచ్చిన ఫోన్ నెంబరును పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ మనోహర్ విజ్ఞప్తి చేశారు.

యువత రక్తదానం



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

అమలాపురం రూరల్: అంబేడ్కర్ 133వ జయంతిని పురస్కరించుకుని దళిత సేన ఆధ్వర్యంలో బుద్ధ మెమోరియల్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం బుధవారం నిర్వహించారు. కోనసీమ కేర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కారెం రవితేజ, విజయ మెడికల్ సెంటర్ అధినేత డాక్టర్ అంబేడ్కర్ రతన్ బెనర్జీ గంటాలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 25 మంది యువత రక్తదానం చేశారు. ఈదరపల్లిలోని హరి మనోవికాస కేంద్రంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాల్లో దళిత సేన అధ్యక్షుడు మెండి డేవిడ్ అంబేడ్కర్, పినిపే రవికుమార్, వాకపల్లి హరీష్, సాపే రమేష్, బత్తుల శీను, ధోనిపాటి నవీన్, చిత్రపు జయరాజ్, బొంతు ఉమ తదితరులు పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియ సంఘం మండల అధ్యక్షుడిగా గాంధీ



కోనసీమ అగ్నికుల క్షత్రియ అల్లవరం మండల కమిటీ సభ్యులు

అల్లవరం: కోనసీమ అగ్నికుల క్షత్రియ సంఘం అల్లవరం మండల అధ్యక్షుడిగా చిలకలపూడి గాంధీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు తారాడి శివ అధ్యక్షతన ఓడలరేవులో గురువారం నూతన కమిటీకి ఎన్నిక నిర్వహించారు. సంఘ ఉపాధ్యక్షుడిగా పినపోతు రమేష్, కార్యదర్శిగా పొన్నమండ శ్రీను ఎంపికయ్యారు. కార్యక్రమంలో రేకాడి సూర్యప్రకాష్, కర్రి స్వామినాథ్, నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలంటూ అసత్య ప్రచారం

తాళ్లరేవు: టీడీపీ కార్యకర్తలకే పాత కండువాలు తీసి కొత్త కండువాలు వేస్తూ టీడీపీలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు చేరుతున్నట్లుగా అసత్య ప్రచారం చేస్తున్నారని చొల్లంగి గ్రామ కమిటీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వరిపల్లి శివాజీ గణేష్ బుధవారం విమర్శించారు. చొల్లంగి గ్రామంలో 200 మంది టీడీపీలో చేరినట్లుగా చెప్పుకోవడం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు కండువాలు వేసిన వారంతా ఒకప్పటి టీడీపీ కార్యకర్తలేనని, వారిలో కొంతమంది జనసేన పార్టీ కార్యకర్తలు ఉన్నారని చెప్పారు. తమ గ్రామ పంచాయతీలో వైఎస్సార్ సీపీ బలంగా ఉండడం చూసి లేనిపోని ప్రచారాలు చేసి లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

పి.గన్నవరం: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నాగుల్లంక పీహెచ్‌సీలో వైద్యాధికారులు మౌనిక రాణి ఆధ్వర్యంలో బుధవారం గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 45 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీహెచ్‌ఓ ఎ.నాగరాజు, పీహెచ్ఎన్ కె.దుర్గాభాయి, సీహెచ్ మరియమ్మ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సుపరిపాలన సీఎం జగన్‌తోనే సాధ్యం



ఎన్నికల ప్రచారంలో అవ్వని అక్కున చేర్చుకుని నేనున్నానంటూ భరోసానిస్తున్న మంత్రి విశ్వరూప్



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న మంత్రి విశ్వరూప్

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- తుమ్మలపల్లి, మొగళ్లమూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

అల్లవరం: రాష్ట్రంలో సుపరిపాలన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని, ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కావడం రాష్ట్రానికి ఎంతో అవసరమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని తుమ్మలపల్లి, మొగళ్లమూరు గ్రామాల్లో బుధవారం ఆయన ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌లతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత తుమ్మలపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ పూలమాలలు వేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇంటింటా వారికి మహిళలు మంగళ హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ఐదేళ్ల పాటు వివిధ పథకాల ద్వారా అందించిన సంక్షేమం కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. నాడు-నాడు పథకం ద్వారా విద్యాలయాలను సమూలంగా మార్చేసి కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యా ప్రమాణాలను పెంచామన్నారు. ప్రతి పల్లెలో ఇంటి వద్దకే వైద్యం అందిస్తున్నామన్నారు. ఆస్పత్రులను ఆధునీకరించి మెరుగైన వైద్య సౌకర్యాలను అందించామన్నారు. ఇవన్ని కొనసాగాలంటే వైఎస్సార్ సీపీకి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి ఇంతకాలం వలంటీర్ల ద్వారా ఇంటి ముంగిటకే పింఛన్లను అందజేసిందన్నారు. ఇప్పుడు చంద్రబాబు అండ్ కో వలంటీర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసి పింఛన్ల పంపిణీలో అవ్వ, తాతలను ఎంత ఇబ్బందో పెట్టారో కళ్ల ముందు కనిపిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అనురాధ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాలను అభివృద్ధి చేయడమే కాకుండా, లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించారన్నారు. ఆయనతోనే ఈ రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందన్నారు. ప్రతిఒక్కరూ వైఎస్సార్ సీపీని ఆదరించి అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు పోటీ చేస్తున్న విశ్వరూప్, రాపాక వరప్రసాదరావులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీలు వడ్డి గంగ, ముత్యాల వెంకట రామకృష్ణ, సర్పంచ్ రాయుడు విష్ణు, ఎంపీటీసీ పులుసుగంటి రాజేశ్వరి, మాకే కృష్ణమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, యూత్ అధ్యక్షుడు బళ్ల శ్యామ్, కాట్రు శాంతికిరణ్, పులుసుగంటి గంగాధర్, కాశీ చిరంజీవి, కొల్లు రమణ, కోరుకొండ చిట్టిబాబు, ముత్తాబత్తుల రమణ, గెద్దాడ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు పేరూరులో విశ్వరూప్ ప్రచారం

అమలాపురం రూరల్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ గురువారం ఉదయం 8 గంటల నుంచి అమలాపురం రూరల్ మండలం పేరూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, మండల సచివాలయాల కన్వీనర్ చొల్లంగి సుబ్బరాం తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు పేరూరు వైజంక్షన్‌లో కుడిపూడి సత్యనారాయణ ఇంటి వద్ద పార్టీ కార్యాలయం ప్రారంభించి పేరూరుపేట, రజక పేట, ఇందిరా కాలనీ, గాంధీనగర్, విశ్వేశ్వర అగ్రహారం, రోళ్లపాలెం, ఇమ్మిడివరప్పాడు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిస్తారన్నారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

అల్లవరం: ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రధాన కూడళ్లలో ప్రయాణికులకు చల్లని తాగునీరు అందించేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కార్యదర్శులను ఆదేశించామని ఎంపీడీఓ కృష్ణమోహన్ బుధవారం తెలిపారు. కోడూరుపాడు, బెండమూర్లంక, గోడిలంక, దేవగుప్తం, బోడసకుర్రు గ్రామాల్లో ఇప్పటికే చలివేంద్రాలను ఏర్పాటుచేశామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీల్‌కుమార్, ఏపీఓ శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

యానాం చేరుకున్న ఈవీఎంలు



కంటైనర్‌లో తీసుకొచ్చిన ఈవీఎంలు

యానాం: ఈ నెల 19న యానాంలో జరిగే పోలింగ్ కోసం పుదుచ్చేరి నుంచి ప్రత్యేక కంటైనర్లలో భారీ భద్రత మధ్య బుధవారం తెల్లవారుజామున ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు(ఈవీఎంలు) యానాం చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు, వీవీ ప్యాట్‌లను బెల్ సంస్థ నుంచి వచ్చిన ఇంజినీర్లు గురు, శుక్ర వారాల్లో రెండు రోజుల పాటు కమిషనింగ్ నిర్వహిస్తారని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి తెలిపారు. యానాం నియోజకవర్గంలో 33 పోలింగ్ బూత్‌లను ఏర్పాటుచేసిన ఒక్కో చోట రెండేసి చొప్పున బ్యాలెట్ యూనిట్లు ఉంచనున్నారు. ఒక్కో బ్యాలెట్ యూనిట్‌కు 16 మంది అభ్యర్థుల పేర్లు, వారి గుర్తులు కనిపిస్తాయి. అయితే పుదుచ్చేరి స్థానానికి పోటీచేసే అభ్యర్థులు 26 మంది ఉండటం, ఒక నోటా బటన్ ఉండటంతో మొత్తం 27 బటన్‌లు ఉండాల్సి రావడంతో రెండేసి బ్యాలెట్ యూనిట్ల అవసరం ఏర్పడింది. ప్రత్యేక కంటైనర్లలో వచ్చిన పోలింగ్ సామగ్రిని ఆర్ఏఓ మునిస్వామి, ఎన్నికల శాఖ ప్రతినిధి తిరుకోటి అర్జునరావు ఆధ్వర్యంలో రాజకీయ పక్షాల సమక్షంలో విడుదల చేసి కంట్రోల్‌రూమ్‌కు తరలించారు.

సంక్షేమానికి పట్టం కట్టండి



అనాతవరంలో ఎమ్మెల్యే పొన్నాడ, పితాని బాలకృష్ణలకు హారతిచ్చి స్వాగతిస్తున్న మహిళలు



అనాతవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పొన్నాడ
- అడుగడుగునా బ్రహ్మరథం పట్టిన ప్రజలు

ముమ్మిడివరం: రాష్ట్రంలో పేదల అభ్యున్నతి కోసం అహర్నిశలు పాటు పడి సంక్షేమ పథకాలను అమలుచేసిన జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలుపించుకోవాలని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం మండలం అనాతవరంలో బుధవారం ఆయన వైఎస్సార్‌సీపీ నాయకుడు పితాని బాలకృష్ణతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లిన ఆయనకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులిచ్చి స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి కోసం మీ అమూల్యమైన రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రాపాక వరప్రసాదరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ మోసపూరిత వాగ్దానాలను నమ్మవద్దని, ప్రలోభాలకు లొంగకుండా వైఎస్సార్ సీపీని బలపరచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోలా గంగాభవానీ, జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, హితకారిణి సమాజం చైర్మన్ కాశి బాలమునికుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, నడింపల్లి సూరిబాబు, కోలా బాబ్జి, మండల పార్టీ కన్వీనర్లు జగతా పద్మనాభం, నల్లా నరసింహమూర్తి, పులిదిండి సుజాత, పులిదిండి గాలంనాథ్, నక్కా సర్వేశ్వరరావు, కముజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలంతా సంసిద్ధులు కండి



కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తదితరులు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ముమ్మిడివరం: సార్వత్రిక ఎన్నికల సమయం ముంచుకొస్తుందని, విజయమే లక్ష్యంగా కార్యకర్తలంతా సంసిద్ధులు కావాలని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ సూచించారు. ముమ్మిడివరం పార్టీ కార్యాలయ ఆవరణలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన బుధవారం జరిగిన నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించేందుకు పార్టీ శ్రేణులంతా సైనికుల్లా పనిచేయాలన్నారు. ఇంటింటికి సంక్షేమాన్ని అందించిన జగనన్నను గెలిపించాల్సిందిగా ప్రజలను అడిగే హక్కు మనకుందన్నారు. ప్రతి ఇంట్లోనూ జగనన్నను తమ సొంత బిడ్డగాను, అన్న, తమ్ముడు, మావయ్య గాను చూస్తున్నారనే విషయాన్ని పార్టీ కార్యకర్తలంతా గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రత్యర్థుల తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని రాబోయే ఎన్నికల్లో ముమ్మిడివరంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేయడం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్రలో అత్యధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ సౌమ్యుడైన పొన్నాడ సతీష్‌కుమార్‌ను అత్యధిగా మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు బుర్రా అనుబాబు, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్ధనరావు, ఎంపీపీలు కోలా గంగా భవానీ, మోర్త మిరియాం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యులు కుడిపూడి శంకరరావు, నేల కిషోర్, ముదునూరి సతీష్‌రాజు, దొమ్మేటి శామ్యూల్ సాగర్, రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, నడింపల్లి సూరిబాబు, ఢిల్లీ నారాయణ, మండల పార్టీ కన్వీనర్లు జగతా పద్మనాభం, నల్లా నరసింహమూర్తి, పిన్నమరాజు వెంకటపతిరాజు, కాదా గోవిందకుమార్, కోలా బాబ్జీ, కాశి బాలమునికుమారి, బొంతు బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

14న వైఎస్సార్ సీపీ కాపు నాయకుల సమావేశం

అమలాపురం రూరల్: అమలాపురం పట్టణ, రూరల్ మండలం వైఎస్సార్ సీపీ కాపు నాయకుల సమావేశం ఆదివారం సాయంత్రం 4 గంటలకు గడియార స్తంభం సెంటర్ వద్ద ఉన్న ఎండూరి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ కాపు ఆహ్వాన కమిటీ నాయకులు తెలిపారు. మాజీ కౌన్సిలర్ వంటెద్దు వెంకన్నాయుడు నివాసంలో బుధవారం రాత్రి కాపు సంఘం నాయకుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సమావేశంలో కౌన్సిలర్ కొల్లాటి దుర్గాబాయ్, దేవస్థానం చైర్మన్ కల్వకొలను బాబి, కర్రి వీర్రాఘవులు, దూడల ఫణి, తోట శ్రీను, మామిళ్లపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

ఉన్నంతలో పేదలకు దానం చేయాలి



అమలాపురం ఇస్నా అసరి మసీదులో ఉపన్యసిస్తున్న ముస్లిం గురువు హైదర్ అలీ

అమలాపురం టౌన్: అందరూ కలిసిమెలిసి జీవిస్తూ ఎవరికి వారు ఉన్నంతలో కొంత పేదలకు దానం చేయాలని ఒడిశా నుంచి అమలాపురం వచ్చిన ముస్లిం గురువు హైదర్ అలీ అన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా అమలాపురం 12వ వార్డులో గల ముజఫర్ సందులోని ఇస్నా అసరి మసీదులో బుధవారం జరిగిన రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొని ఉపన్యసించారు. ఖురాన్ పఠనం ద్వారా ముస్లింలు 30 రోజుల కఠిన ఉపవాస దీక్షలు చేసి నెల వంక చూసి దీక్షలు విరమిస్తారని చెప్పారు. మసీదులో అవసరమైన సౌకర్యాల ఏర్పాట్లను పర్యవేక్షించిన మసీదు ధర్మకర్త మహ్మద్ నిసార్ హుస్సేన్, కార్యదర్శి కరార్ హుస్సేన్‌లను ఆయన అభినందించారు. అనంతరం అందరూ ఇఫ్తార్ విందు చేశారు.

మంత్రి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరికలు



పాలగుమ్మిలో పార్టీలో చేరిన కార్యకర్తలతో మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం రూరల్: మండలంలోని పాలగుమ్మి చెరువు గట్టు ప్రాంతానికి చెందిన 50 మంది టీడీపీ కార్యకర్తలు కోట కృపావతి, కుసుమ కృష్ణవేణి, సరేళ్ల రాజు, కాండ్రేగుల వరలక్ష్మి, సబ్బితి వెంకాయమ్మ, సరేళ్ళ రామారావు, సరేళ్ల సత్యనారాయణ, మాతా వీరవెంకట సత్యనారాయణ, కుసుమరెడ్డి నాయుడు, సబ్బితి సూర్యారావు తదితరులు బుధవారం రాత్రి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి విశ్వరూప్ వారికి వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి, ఎంపీటీసీ పాలగుమ్మి వాసు, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు బొక్కా ఏడు కొండలు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కొల్లూరికి ఉగాది ప్రతిభా పురస్కారం

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన కవి, తెలుగు అధ్యాపకుడు డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరికి వాసవీ ఉగాది ప్రతిభా పురస్కారం లభించింది. మండపేటలో ఉగాది పర్వదినాన మంగళవారం రాత్రి జరిగిన వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సమావేశంలో క్లబ్ మాజీ అధ్యక్షుడు నూలు వెంకట రమణ మూర్తి చేతుల మీదుగా డాక్టర్ కొల్లూరికి ఈ పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో అమలాపురం వాసవీ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సూర్యనారాయణ, కార్యదర్శి సమయమంతుల మురళీ, క్లబ్ వైస్ గవర్నర్ యెండూరి రాఘవ, జిల్లా ఆర్య వైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు యెండూరి సీత తదితరులు పాల్గొన్నారు.

కవి నల్లాకు ఉగాది పురస్కారం

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన కవి, శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తికి హైదరాబాద్ 'మన మాతృ భాష తెలుగు సాహిత్య సామాజిక అంతర్జాతీయ మాస పత్రిక' క్రోధి నామ సంవత్సర ఉగాది పురస్కారాన్ని అందించింది. ఈ ప్రశంసా పత్రాన్ని పత్రిక ప్రధాన సంపాదకురాలు కవిత చిర్ల బుధవారం ఆయనకు ఆన్‌లైన్ ద్వారా పంపించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తిని అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, కళా వేదిక జాతీయ కార్యదర్శి మాకే బాలార్జున సత్యనారాయణ అభినందించారు.

మండల విభాగ నాయకుల నియామకం



వెంటపల్లి వాసంతి



దడాల జగదీశ్వరరావు



వెంకట శివరామప్రసాద్

తాళ్లరేవు: మండలంలోని వైఎస్సార్ సీపీ పలు మండల విభాగాలకు అధ్యక్షులను నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవింద కుమార్ తెలిపారు. పార్టీ మండల వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా పి.మల్లవరం గ్రామానికి చెందిన వెంటపల్లి వాసంతి నియమితులయ్యారు. మండల ఎస్సీసెల్ విభాగం అధ్యక్షునిగా దడాల జగదీశ్వరరావు, మండల చేనేత విభాగం అధ్యక్షునిగా ముద్దన వెంకట శివరామ ప్రసాద్ నియమితులైనట్లు గోవిందకుమార్ తెలియజేశారు. పార్టీ పదవులకు ఎంపికైన వారిని ఆయన అభినందించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

తాళ్లరేవు: మండల పరిధిలోని పి.మల్లవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1988-89 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు బుధవారం ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. ఈ సందర్భంగా అప్పట్లో పాఠశాల ఏర్పాటుకు విశేష కృషి చేసిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బండి సత్యనారాయణ దంపతులను వారంతా ఘనంగా సత్కరించుకున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ ఆర్గనైజర్ ధూళిపూడి వెంకటరమణ మాట్లాడుతూ పి.మల్లవరంలో హైస్కూల్ ఏర్పాటు చేసిన అనంతరం తొలి బ్యాచ్ తమదేనన్నారు. తొలి బ్యాచ్‌కు గుర్తుగా తాము చదువుకున్న పాఠశాలకు ఏదో ఒక కార్యక్రమం చేయాలని తీర్మానం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఖండవిల్లి సురేష్, శారద, పద్మ, మధు, మూర్తి, చంటి, హరి, శ్యామ్, రవి, రామ్మోహన్‌రావు, అంబేడ్కర్, సాయి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



మురమళ్లలో మూకుమ్మడి రాజీనామాలు చేసిన గ్రామ వలంటీర్లు

ఐ.పోలవరం: ప్రతిపక్ష పార్టీలు అవలంబిస్తున్న నిరంకుశ వైఖరి, అనాలోచిత నిర్ణయాలను నిరసిస్తూ మండలంలోని మురమళ్ల గ్రామ సచివాలయం-1, 2 పరిధిలోని 30 మంది గ్రామ వలంటీర్లు బుధవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను సచివాలయ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ ఇంతకాలం ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిరుపేదలకు చేరవేస్తూ ఎంతో సేవ చేస్తున్న తమపై చంద్రబాబు పదే పదే ఆరోపణలు చేయడం బాధించి ఉద్యోగాలకు రాజీనామా చేశామన్నారు. తాము కరోనా కాలంలో ప్రాణాలకు తెగించి సేవలు చేశామన్న సంగతి మరిచిపోయి పింఛన్లు సైతం ఇవ్వకుండా అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి తమ వంతుగా పనిచేస్తామని, అందుకే మూకుమ్మడి రాజీనామాలు చేశామని చెప్పారు.

ఘనంగా మాణిక్యాంబ తీర్థం

ఐ.పోలవరం: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం మురమళ్ల మాణిక్యాంబ అమ్మవారి తీర్థ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. మంగళవారం రాత్రి మాణిక్యాంబ అమ్మవారి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గరగ నృత్యాలు, కోలాటాలు, తీన్‌మార్, విచిత్ర వేషధారణలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పచ్చిపూలతో అలంకరించారు. బుధవారం వేకువజామున 2 గంటలకు జాతీయ రహదారి 216పై నిప్పుల గుండం చూసేందుకు మండలం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. గత రెండు రోజుల్లో సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



మురమళ్ల మాణిక్యాంబ అమ్మవారు